

ధర్మారం : రాష్ట్ర రహదారిపై ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

## నిర్బంధం ఎందుకు?



మా పార్టీ నాయకులు, కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేశారు. ఇండ్ల నుంచి బలవంతంగా తీసుకొచ్చి, ఫోన్ చేసి బెదిరించి పిలిపించుకుని గంటల తరబడి స్టేషన్లలో కూర్చోబెట్టుకున్నారు. ఇది ఎంత వరకు సమంజసం. పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించవద్దు. మా పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను అయితే ఇంట్లోంచి బయటికి రానివ్వలేదు. మాకు వ్యక్తిగత స్వేచ్ఛ కూడా లేకుండా చేశారు. ఇది మంచి పద్ధతి కాదు. ఏ తప్పూ చేయనప్పుడు స్టేషన్లలో గంటల తరబడి ఎందుకు కూర్చోబెట్టినట్లు. దీనికి ప్రభుత్వమే సమాధానం చెప్పాలి.

**- జీవీ రామకృష్ణారావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు (కరీంనగర్)**

# బీఆర్ఎస్ నేతలపై నిర్బంధకాండ

- ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఘటన నేపథ్యంలో పోలీసుల జులుం
- ఇండ్లకు వెళ్లి బలవంతంగా గులాబీ శ్రేణుల అరెస్టులు
- ఫోన్లు చేసి స్టేషన్లకు రావాలని హుకుం
- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె హౌస్ అరెస్ట్
- పలు చోట్ల రేవంత్ దిష్టిబొమ్మల దహనం
- సర్కారు తీరుపై వెల్లువెత్తిన నిరసనలు
- పలు చోట్ల రాస్తారోకోలు

బీఆర్ఎస్‌పై నిర్బంధకాండ కొనసాగుతున్నది. పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన పార్టీ శ్రేణులపై కాంగ్రెస్ సర్కారు ఉక్కుపాదం మోపుతున్నది. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేసిన నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా నిరసనలు రావొచ్చని, ఇక్కడి నుంచి హైదరాబాద్ తరలివెళ్తారని గ్రహించిన పోలీసులు గురువారం రాత్రి నుంచే ముందస్తు అరెస్టులు చేశారు. నాయకుల ఇండ్లలోకి వెళ్లి బలవంతంగా పోలీస్ స్టేషన్లకు తీసుకెళ్లారు. ఫోన్లు చేసి స్టేషన్లకు రావాలని నాయకులు, కార్యకర్తలకు హుకుం జారీ చేశారు. శుక్రవారం ఏ పోలీస్ స్టేషన్‌లో చూసినా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలే కనిపించారు. బలవంతంగా స్టేషన్లలో ఉంచుకుని కనీసం మంచి నీళ్లు కూడా ఇవ్వకుండా గంటల తరబడి కూర్చోబెట్టారు. ఏ తప్పూ చేయకున్నా తమనెందుకు అరెస్ట్ చేశారని ప్రశ్నించినా సమాధానం లేదని నాయకులు మండిపడ్డారు. ఇది పోలీసుల అత్యుత్సాహమని, ప్రజాస్వామ్యాన్ని కాలరాయడమేనని బీఆర్ఎస్ జిల్లాల అధ్యక్షులు తీవ్రంగా ఖండించారు.

**-కరీంనగర్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ)**



సిరిసిల్ల టౌన్: సిరిసిల్ల పోలీస్ స్టేషన్ ఎదుట నినదిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



గోదావరిఖని : గోదావరి బ్రిడ్జిపై ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్‌ను అరెస్ట్ చేస్తున్న పోలీసులు



సిరిసిల్ల టౌన్ : జిల్లా కేంద్రంలోని నేతన్న చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్‌వీ నాయకులు

గంగాధర మండలం బూరుగుపల్లిలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను గృహ నిర్బంధం చేశారు. ఆయనను ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా ఇంటి చుట్టూ పెద్ద సంఖ్యలో పోలీసులను ఏర్పాటు చేశారు. చొప్పదండి మండలంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ భర్త మాచర్ల వినయ్‌ను ఇండ్లకు వెళ్లి అరెస్ట్ చేయగా, గంగాధర మండలాధ్యక్షుడు మేచినేని నవీన్ రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావుకు ఫోన్లు చేసి రప్పించుకుని మరీ నిర్బంధించారు. కరీంనగర్‌లో పార్టీ నగరాధ్యక్షుడు చల్ల హరిశంకర్, దిండిగాల మహేశ్, గందె మహేశ్, ఎడ్ల అశోక్, ఐలెందర్‌యాదవ్‌తో పాటు మరి కొందరిని టూ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండల్లో పలు గ్రామాల నాయకులను అరెస్ట్ చేశారు. గన్నేరువరంలో మండల శాఖ అధ్యక్షుడు గంప వెంకన్నతో పలువురు నాయకులను గంటల తరబడి స్టేషన్‌లో ఉంచారు. తిమ్మాపూర్ మండలంలో మండలాధ్యక్షుడు రావుల రమేశ్, మానకొండూర్ మండలాధ్యక్షుడు రాయికంటి కిరణ్‌తో పాటు పలువురిని అరెస్ట్ చేశారు. చిగురుమామిడి బస్టాండ్ వద్ద రాస్తారోకో చేసేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ నాయకులను బలవంతంగా అరెస్ట్ చేశారు. హుజూరాబాద్‌లో ఎస్సీ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు బండ శ్రీనివాస్‌తోపాటు కౌన్సిలర్లు, నాయకులను ముందుగానే అరెస్ట్ చేశారు. వీణవంక మండలం చల్లూరులో రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ మండలంలోని కిష్టంపేట, వీణవంక, గన్ముక్కుల, ఎలుబాక, రెడ్డిపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకుల ఇండ్లకు వెళ్లి అరెస్ట్ చేసి స్టేషన్‌కు తీసుకెళ్లారు. జమ్మికుంటలో పలువురు కౌన్సిలర్లు, నాయకులను అరెస్టు చేశారు. ఇల్లందకుంట నుంచి జవ్వాజి కుమార్‌స్వామి, ఆలేటి శ్రీరాంను ఇండ్లలో ఉండగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తీసుకెళ్లారు.



గంగాధర : బూరుగుపల్లిలో మాజీ ఎమ్మెల్యే రవిశంకర్‌ను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు



కరీంనగర్ కార్పొరేషన్ : టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు



వీణవంక : చల్లూరులో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కరీంనగర్ : టూటౌన్‌లో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, నాయకులు



కథలాపూర్ : పోలీస్‌స్టేషన్‌లో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, బీఆర్ఎస్ నాయకులు



జగిత్యాల టౌన్ : పోలీస్ స్టేషన్‌లో అర్ధరాత్రి అరెస్ట్ చేయడంపై ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు శీలం ప్రవీణ్, దావ సురేశ్ తదితరులు




వీణవంక : పోలీస్ స్టేషన్‌లో మాజీ సర్పంచులు




ఎల్లారెడ్డిపేట: పోలీస్ స్టేషన్ ఎదుట అరెస్ట్ అయిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాయకులు

## దాడి హేయమైన చర్య

- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత



మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

రాయికల్, సెప్టెంబర్ 13: హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి హేయమైన చర్య అని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావసంత మండిపడ్డారు. రాయికల్ పట్టణంలో మండల, పట్టణ బీఆర్ఎస్ నాయకులతో కలిసి శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎమ్మెల్యే గాంధీ ఇప్పటికీ బీఆర్ఎస్‌లోనే ఉనాన్నని చెప్పడంతో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వారిని గులాబీ కండువాతో సత్కరించి.. బీఆర్ఎస్ జెండాను వారి ఇంటిపై ఎగురవేస్తామంటే కౌశిక్‌రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ గుండాలు దాడిచేయడం బాధాకరమన్నారు. 60లక్షల కార్యకర్తల బలం ఉన్న బీఆర్ఎస్ పార్టీ జోలికి వస్తే.. ప్రతిదాడులను ఎదుర్కొనే శక్తి కాంగ్రెస్‌కు లేదన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపు మేరకు హైదరాబాద్ వెళ్తున్న తమ నాయకులు, కార్యకర్తలను ఎక్కడికక్కడ అరెస్ట్ చేసి నిర్బంధించడం దారుణమన్నారు. కేసీఆర్ పాలన స్వర్ణయుగంలా ఉంటే.. రేవంత్ పాలన నరకయాతనలా ఉందన్నారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు ఎలిగేటి అనిల్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు స్పందన సాగర్‌రావు, కౌన్సిలర్లు శ్రీధర్‌రెడ్డి, శ్రీరాముల సువర్ణ సత్యనారాయణ, మహేశ్‌గౌడ్, సాయికుమార్, మండల సమన్వయ సభ్యులు సురేందర్‌నాయక్, మల్లేశ్ యాదవ్, కొల్లూరి వేణు, దొంతి నాగరాజు, ఏఎంసీఈ మాజీ చైర్మన్ ఏనుగందుల ఉదయశ్రీ, మైనార్టీ సెల్ అధ్యక్షుడు చాంద్ పాషా, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నీరేటి శ్రీనివాస్, నాయకులు పెండెం కవిత, కొత్తపెల్లి ప్రసాద్, మరిపెల్లి నారాయణగౌడ్, రామ్ చంద్రం, వినోద్, ముక్కెర శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ది గూండాలపాలన

- శాంతిభద్రతలను కాపాడడంలో రేవంత్ సర్కారు విఫలం
- మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్

గోదావరిఖని, సెప్టెంబర్ 13: ప్రజాపాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో గుండాల పాలన చేస్తున్నదని బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఈ ఘటనపై సీఎం వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి గోదావరి బ్రిడ్జిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా చందర్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే గాంధీ తన అనుచరులతో కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దాడులు ఎవరి కనుసన్నల్లో నడుస్తున్నాయో ప్రజలందరికీ తెలుసునన్నారు. దాడికి పాల్పడిన వారందరినీ అరెస్ట్ చేయాలన్నారు. గాంధీతో సహా పార్టీ మారిన ఎమ్మెల్యేలంతా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు పెంట రాజేశ్, బొడ్డు రవీందర్, నూతి తిరుపతి, జక్కుల తిరుపతి, కృష్ణవేణి, గాదం విజయ, గుంపుల లక్ష్మి, సంధ్యారెడ్డి, స్వప్న, తిరుమల, శ్రీనివాస్, ప్రశాంత్, శ్రావణ్, సతీశ్, తదితరులు ఉన్నారు.

## హౌస్ అరెస్ట్‌లు సిగ్గుచేటు

- హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్



చిగురుమామిడి, సెప్టెంబర్ 13: బీఆర్ఎస్ నేతలు అంటే సీఎం రేవంత్‌రెడ్డికి ఎందుకు అంత వణుకు, రాష్ట్రవ్యాప్తంగా తమ పార్టీ నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ హౌస్ అరెస్టు చేయడం, అదుపులోకి తీసుకోవడం సిగ్గుచేటని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ బీఆర్ఎస్‌లో ఉన్నట్టా..? కాంగ్రెస్‌లో చేరినట్టా..? స్పష్టం చేయాలని, ప్రెస్‌మీట్‌లో నీళ్లు నములుతూ స్పష్టత లేకుండా మాట్లాడుతున్న అరికెపూడికి దమ్ముంటే గులాబీ కండువా వేసుకొని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫొటో తన పక్కన పెట్టుకుని మాట్లాడాలని సవాల్ విసిరారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించిన ప్రతీసారి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ఏదో ఒక హైడ్రామాకు తెరలేపి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. విపక్ష పార్టీ ఎమ్మెల్యేపై దాడి చేయించి, సీఎం నేడు శాంతి భద్రతల పేరెత్తడం విడ్డూరంగా ఉందన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటూ ఆనాటి ఎమర్జెన్సీ రోజులను అమలు చేస్తున్నారని మండిపడ్డారు. విద్వేషాలను రెచ్చగొట్టవద్దని డీజీపీ ఏకపక్షంగా బీఆర్ఎస్ నాయకులకు చెప్పడం ఎమర్జెన్సీని తలపించేలా కనిపిస్తోందన్నారు. దాడికి పాల్పడింది కాంగ్రెస్ పార్టీ నాయకులు, అరికెపూడి గాంధీ అనుచరులైతే, వార్నింగ్ మాత్రం బీఆర్ఎస్ నేతలకు ఇస్తారా.. ఇది హాస్యాస్పదంగా ఉందన్నారు. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ తీరును ప్రజలు గమనిస్తున్నారని, ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే విపక్ష ప్రజాప్రతినిధులపై దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఇమేజ్‌ను డ్యామేజ్ చేసేలా ప్రవర్తిస్తామంటే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోబోదని, తెలంగాణ ప్రజలు కర్రు కాల్చి వాత పెడతారని హెచ్చరించారు.

## సర్వర్ డౌన్

### నిలిచిపోయిన 'మీ సేవ'లు

- మూడు రోజుల నుంచి సమస్య
- అవస్థలు పడుతున్న ప్రజలు

నిత్యం వేలాది మంది వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం మీ సేవ కేంద్రాలకు వెళ్తుంటారు. ప్రధానంగా ఆదాయ, కుల, నివాస, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలతోపాటు పోటీ పరీక్షలకు దరఖాస్తు సమర్పిస్తుంటారు. మూడు రోజుల నుంచి సర్వర్‌డౌన్ కావడంతో మీ సేవ కేంద్రాలు నిలిచిపోగా, డాక్యుమెంట్ల కోసం వేలాది మంది ప్రజలు అవస్థలు పడుతున్నారు. గంటల వ్యవధిలోనే సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తుండడంపై వారు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.




కరీంనగర్ కలెక్టరేట్, సెప్టెంబర్ 13: ప్రజల సౌలభ్యమే లక్ష్యంగా వేగంగా... సులువుగా సేవలందించేందుకు గానూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 550వరకు మీ సేవ కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో జిల్లాలో రోజుకు దాదాపు 1,200 నుంచి 1,500దాకా వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తులు వస్తుంటాయి. ప్రధానంగా రెవెన్యూ శాఖ ద్వారా అందించే ఆదాయ, కుల, నివాస, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలే కీలకమైనవి. ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు పలు విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ఇతర ప్రవేశాల కోసం ప్రాథమికంగా మీ సేవ కేంద్రాల్లోనే సమర్పించాల్సి ఉంటుంది. ఇటీవలి కాలంలో మీ సేవ కేంద్రాల్లో తరచుగా సర్వర్లు పని చేయకపోవడంతో గంటల వ్యవధిలోనే పరిష్కారం చూపేవారు. అయితే మూడు రోజుల నుంచి కేంద్రాలు మొత్తమే పని చేయకపోవడంతో పోటీ పరీక్షలు, ఉద్యోగార్హత పరీక్షలకు దరఖాస్తు చేసుకునే వేలాది మంది అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వానికి లక్షల్లో నష్టం వస్తున్నా పట్టించుకోకపోవడంపై వారు తీవ్రంగా మండిపడుతున్నారు. డీఎస్సీ దరఖాస్తుల గడువు కూడా నేటితో ముగియనున్నది. సర్వర్ సమస్యతో ఇప్పటివరకు కనీసం దరఖాస్తు చేసుకునే అవకాశం లభించకపోవడంతో విద్యాసంవత్సరం కోల్పోవాల్సి వస్తుందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. సర్వర్ సమస్య పరిష్కారం కాకుంటే ప్రత్యామ్నాయంగా ధ్రువీకరణ పత్రాలు అందించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

### రాష్ట్ర వ్యాప్తంగా సర్వర్‌డౌన్ సమస్య

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మీ సేవ కేంద్రాల్లో మూడు రోజుల నుంచి సర్వర్ డౌన్ సమస్య ఉన్నది. గతంలో కూడా పలు సందర్భాల్లో ఇలాంటి సమస్యలు ఎదుర్కొన్నా అప్పుడు గంటల వ్యవధిలోనే పరిష్కారం లభించేది. ఎన్నడూ ఇలాంటి ఇబ్బంది ఎదుర్కొలేదు. సర్వర్‌డౌన్ సమస్య పరిష్కారం మా చేతుల్లో లేదు. ప్రత్యామ్నాయ మార్గంపై ఉన్నతాధికారులు అన్వేషిస్తున్నారు.

**- శ్రీనివాస్‌రెడ్డి, ఈడీఎం (కరీంనగర్)**

## అసభ్య ప్రవర్తనపై విచారణ

- వివరాలు సేకరించిన ఇన్‌చార్జి డీఈవో
- తల్లిదండ్రుల ఫిర్యాదుతో ఇద్దరు టీచర్లపై కేసు



తారుపల్లిలో విచారణ చేస్తున్న ఇన్‌చార్జి డీఈవో జనార్దన్‌రావు

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబర్13 : కాల్వశ్రీరాంపూర్ మండలం తారుపల్లి హైస్కూల్‌లో ఇద్దరు ఉపాధ్యాయులు అసభ్య ప్రవర్తనపై ఇన్‌చార్జి డీఈవో జనార్దన్‌రావు శుక్రవారం విచారణ చేపట్టారు. గురువారం ఓ ఉపాధ్యాయుడికి గ్రామస్తులు దేహశుద్ధి చేసిన విషయం తెలిసిందే కాగా, ఈ విషయమై ఇన్‌చార్జి డీఈవో శుక్రవారం పాఠశాలకు వచ్చారు. విద్యార్థులు, ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తుది నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు. కాగా, ఈ ఘటనపై పోలీసులు కూడా పాఠశాలలో విచారణ జరిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఇద్దరు ఉపాధ్యాయులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ వెంకటేశ్ తెలిపారు. తమ పిల్లల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలని, వారు పాఠశాలకు వస్తే ఊరుకునేది లేదని విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్చరించారు.